క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



జె.అన్నవరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన అంజూ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు రోగులకు కంటి పరీక్షలు చేసి సుమారు 25 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం కాకినాడ తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ వేలంలో నిబంధనలకు తూట్లు

గండేపల్లి: జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మీవెంకయమ్మ సత్రానికి చెందిన 59.20 ఎకరాల భూమిలో జామాయిల్ తోటకు మండలంలోని ఉప్పలపాడులో దేవదాయశాఖ అధికారులు ఇటీవల బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో అధికారులు నిబంధనలు పాటించలేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. బహిరంగ వేలానికి ముందు గ్రామాల్లో ఎటువంటి ప్రచారం చేయకపోవడంతో వేలం గురించి తమకు తెలియదని చెబుతన్నారు. దేవదాయశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా తమకు అనుకూలంగా ఉన్నవారికే వేలం కట్టబెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము వేలంలో పాల్గొంటే శిస్తు అధికంగా లభించేదని, సత్రంలోని నిరుపేదలకు ఉపయోగపడేదని ఉప్పలపాడు గ్రామస్తులు చెబుతున్నారు.

కొనసాగుతున్న పోలవరం నిర్వాసితుల దీక్ష

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గోకవరంలో పోలవరం నిర్వాసితులు చేస్తున్న దీక్ష నాల్గోరోజు ఆదివారం కొనసాగింది. పలువురు నాయకులు, ప్రజా సంఘాల నేతలు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన



గుమ్మరేగుల వద్ద ఏలేరు ఎడమ కాలువపై శిథిలమైన వంతెన

రౌతులపూడి: రౌతులపూడి–ఎస్.పైడిపాల ఆర్ అండ్‌బీ రహదారిలో గుమ్మరేగుల వద్ద ఏలేరు ఎడమ కాలువపై వంతెన శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనపై వేసిన సిమెంట్ కాంక్రీట్ శ్లాబ్ మొత్తం బీటలు వారింది. దీంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థ ఉన్న వంతెనపై సైతం నిత్యం సుమారు 50 టన్నుల బరువు గల భారీ క్వారీ వాహనాలు తిరగడంతో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కొద్దిపాటి వర్షం పడినా వంతెనపై నీరు చేరుతోంది. వంతెనపై గోతులు ఉండడంతో వాటిలో నీరు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఇటీవల జరిగిన ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. దీనిపై గతంలో అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన అభివృద్ధి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరో వాయుగండం

- బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- మిచాంగ్ తుపాను నుంచి ఇంకా కోలుకోని రైతులు
- పలు గ్రామాల్లో పూర్తికాని వరి కోతలు
- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీబిజీ



గోపాలపట్నంలో పనలపై ఉన్న వరి

తొండంగి: మిచాంగ్ తుపాను చేసిన నష్టాల నుంచి ఇంకా కోలుకోకుండానే మరో వాయుగుండం రైతులను కలవరపరుస్తోంది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఉన్నంతలో ఒబ్బిడి చేసుకునేందుకు అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారనుందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

12 వేల ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా పంపా, పీబీసీ, చెరువులు, వ్యవసాయ బోర్ల పరిధిలో ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేశారు. వ్యవసాయ బోర్ల పరిధిలో వరినాట్లు ముందుగా పడటంతో దాదాపుగా వెయ్యి ఎకరాల్లో పంట మాత్రమే కోతలు కోసి ఒబ్బిడి చేసుకున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలో సుమారు ఏడు వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. 600 ఎకరాల్లో పనలపై పంట రోజుల తరబడి ముంపులో ఉండిపోవడంతో ధాన్యం మొలకలు వచ్చాయి. కొన్నిచోట్ల వరిపనలు కుళ్లిపోయాయి. మిగిలిన మరో 65 ఎకరాల్లో పంట కోత దశలో ఉండగా నేలరాలి ముంపు బారిన పడింది. వారం పది రోజులుగా ముంపు తొలగిన ప్రాంతాల్లో పంటను ఉన్నంతలో ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ముంపు తొలగిన పొంతాల్లో పంటను మెరక ప్రాంతాలకు తీసుకెళ్లి నూర్పిడి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుప్పలుగా వేసిన పంటలను ఒబ్బిడి చేసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు.



ఎ.కొత్తపల్లిలో వరిపంటను ట్రాక్టర్‌పై వేస్తున్న కూలీలు



కోదాడలో ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసిన రైతులు

కూలీల కొరతతో ఇక్కట్లు

రైతులందరూ ఒకేసారి పంట ఒబ్బిడి పనులు చేయడంతో కూలీల కొరత నెలకొంది. అలాగే కూలి రేట్లు కూడా భారీగా పెరిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు పంట నేలనంటడంతో మెషీన్లతో కొయించే అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులు భారమైనా కూలీలతోనే కొయిస్తున్నారు.

పంట నష్టం అంచనాలో అధికార యంత్రాంగం

మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసే పనిలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నారు. దాదాపు 6 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.నరసింహం తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. రెండు రోజుల్లో రైతులు జాబితాను అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తామని, అభ్యంతరాలు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మారిన వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. సముద్రం వైపు నుంచి ఈదురు గాలులు స్వల్పంగా వీస్తున్నాయి. ఈ మాగుడు వాతావరణంతో పంట ఒబ్బిడి కాని రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అల్పపీడనం వాయు గండంగా మారకుండా తొలగిపోవాలని రైతులు కోరుతున్నారు. వారిన వాతావరణం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు అధికారులు సూచించారు.

నాలుగెకరాల్లో పంట నీట మునిగింది



నాకు ఉన్న రెండెకరాలతో పాటు మరో రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశాను. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను. తుపాను కారణంగా పంట అంతా నీటిలో మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయాను. ఆ పంట ఇంకా ముంపులోనే ఉంది. ఒబ్బిడి చేసుకుందామంటే మళ్లీ వాయుగుండం అంటున్నారు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– సారిపల్లి మాణిక్యం, రైతు, సీతారాంపురం

ఉరుకులు.. పరుగులు



కోటనందూరులో కోసిన పంటను కుప్ప వేసేందుకు తరలిస్తున్న రైతులు



కేపీ మల్లవరంలో వరిపంట కోస్తున్న వ్యవసాయ కూలీలు

కోటనందూరు: వాతావరణంలో వచ్చిన మార్పులతో అన్నదాత ఉరుకులు, పరుగులు పెడుతున్నాడు. మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడంతో కొంతమంది రైతులు కోసి పనలపై ఉన్న పంటను వడివడిగా కుప్పలు వేశారు. మరికొంత మంది జోరుగా కోతలు కోస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 10 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా 10 శాతం పంటను ఇప్పటికే కోసి కుప్పలు వేశారు. మరో 50 శాతం పంట కోసి ప్రస్తుతం పనలపై ఉండగా పక్వానికి చేరిన మరో 20 శాతం పంటను క్రమంగా కోస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం కురిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి రాత్రనక, పగలనక కష్టపడిన కష్టమంతా నీటిపాలవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఏటా ఖరీఫ్ చివరిలో ఈ ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి సర్వం సిద్ధం



కత్తిపూడిలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అలంకరణ

- నేడు షష్ఠి మహోత్సవం
- సుందరంగా ముస్తాబైన ఆలయాలు



అన్నవరంలో పసుపు దంచుతున్న ముత్తైదువులు

ఏలేశ్వరం: సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవానికి సర్వం సిద్ధంమైంది. నియోజవర్గవ్యాప్తంగా ఆదివారం షష్ఠి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పలు గ్రామాల్లో షష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని సాయిబాబామెట్టపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెలవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద పలు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యర్రవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెండ్లి కుమారుడిగా సుబ్రహ్మణ్యస్వామి

శంఖవరం: షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుబ్రహ్మణ్యస్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను సుందరంగా అలంకరించారు. సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తొండంగి: అన్నవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నవరం దేవస్థానం సౌజన్యంతో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలు చేశారు. శేష మయూర వాహనంపై అన్నవరం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు కల్యాణోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం సోమవారం అన్నవరం దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, సర్వదర్శనాలు, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి ఏడు గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. మంగళవారం ఉంజల్ సేవ, శ్రీపుష్పయాగం నిర్వహిస్తామని వివరించారు.



ఏలేశ్వరంలో వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామివారు



ఏలేశ్వరంలో షష్ఠి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



అన్నవరంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు

మోగిన నెలగంట

- ధనుర్మాసం ప్రారంభం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో నెలగంట పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: మకర సంక్రాంతి వేడుకలకు సూచికగా గ్రామాల్లో వివిధ ఆలయాల్లో నెలగంట మోగించారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్.అన్నవరం, కేఓ.మల్లవరం, చామవరం, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, ఎన్.సూరవరం, వి.కొత్తూరు, వల్లూరు, టి.తిమ్మాపురం, రాపాక, దొండవాక తదితర గ్రామా ల్లోని ఆలయాల్లో నెలగంట మోగించారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు ధనుర్మాస ప్రారంభ పూజలు చేశారు. స్వామివారికి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

గండేపల్లి: ధనుర్మాసం ప్రారంభమైంది. తాళ్లూరు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజేంద్రపుష్కరిణి నుంచి తీర్థం బిందెను తీసుకువచ్చి స్వామివారికి నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి, ఆండాళ్లమ్మవారి పాసురాలను పఠించి తిర్పావై పారాయణ కావించారు.



ఏలేశ్వరంలో నగర సంకీర్తన చేస్తున్న మహిళలు

నగర సంకీర్తన

ఏలేశ్వరం: ధనుర్మాసం ప్రారంభం కావడంతో పట్టణంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఏలేశ్వరం భజన సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని పలువీధుల మీదుగా నగర సంకీర్తన చేశారు. భక్తి పాటలు ఆలపిస్తూ భజనలు చేస్తూ మహిళలు, భక్తులు వీధుల్లో తిరిగారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. గ్రామాల్లో సంక్రాంతి సందడి ప్రారంభమైంది.

రబీ వరినాట్లు ప్రారంభం



బెండపూడిలో రబీ వరినాట్లు వేస్తున్న కూలీలు

తొండంగి: మండలంలో రబీ వరినాట్లు ప్రారంభమయ్యాయి. వ్యవసాయబోర్ల పరిధిలో దాదాపుగా రెండు వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ పంట ఒబ్బిడి పనులు పూర్తికావడంతో రబీ వరినారుమడులు రైతులు సిద్ధం చేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో బోర్లు పరిధిలో వరినాట్లు చేస్తున్నారు. మండలంలోని బెండపూడి, కొమ్మనాపల్లి, శృంగవృక్షం, కోదాడ, తొండంగి, రావికంపాడు తదితర గ్రామాల్లో రబీవరి సాగు పనులు జోరుగా సాగుతున్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం

ఏలేశ్వరం: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో పెన్షన్ పితామహుడు డీఎస్ నకరా చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంఖాన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు వరకూ వెళ్లి పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టిన నకరాకు పెన్షన్‌దారులు రుణపడి ఉంటారన్నారు. ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఇండియా మేనేజర్ గిరిధర్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు వక్కలంక వెంకటేశ్వరరావు, కోరాడ అప్పలస్వామి, బళ్ల శ్రీరాములు, కొప్పుల సాంబశివరావు, పంబల గంగాధరావు, వంగలపూడి రామారావు, పులపకూరి స్వర్ణకుమారి, ఒంగోలు మల్లాద్రిలను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు, కార్యదర్శి పొన్నాడ జోగిరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఉపాధ్యక్షుడు చెన్నాప్రగడ సత్య గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ప్రత్తిపాడు: విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాన్ని వృత్తిలో కొనసాగుతున్న ఉద్యోగులకు అందించాలని ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. తొలుత డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆనాడు డీఎస్ నకరా చేసిన కృషి ఫలితంగానే నేడు విశ్రాంత ఉద్యోగులు సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. అనంతరం ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ పరిధిలో 80 ఏళ్ల వయస్సు దాటిన విశ్రాంత మెడికల్ ఆఫీసర్ ఎం. తిరువెంగళాచార్యులు, పీలా అప్పారావు, నూకల వీరభద్రరావు, శేషగిరిరావు, బి.దమయంతి, బేతా సూర్యాకాంతం, సీతయ్యమ్మలతో పాటు 15 మంది విశ్రాంత ఉద్యోగులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విశ్రాంత వైద్యాధికారి ఏవీ రమణ, మండల పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు ముక్కు సుబ్రహ్మణ్యం, బర్రే కోటేశ్వరరావు, బొడ్డేటి ఆదిరాజు, ఏవీ రమణ, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తుని: స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పి.మాధవరావు ఆధ్వర్యంలో పెన్షనర్ల పితామహుడు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు పెన్షనర్ల దినోత్సవ ప్రాముఖ్యత, పెన్షనర్ల సమస్యలు, వాటి పరిష్కారాలను వివరించారు. 73 ఏళ్లు దాటిన సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారులు బాలచందర్, నాగభూషణం, ఎస్‌బీఐ ఛీఫ్ మేనేజర్ సుధాకర్, సంఘ కార్యదర్శి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ గిరిధర్



తునిలో సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు



కోటనందూరులో నకారా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, పెన్షనర్లు

పెన్షన్ల సంఘ అభివృద్ధికి కృషి

కోటనందూరు: పెన్షనర్ల సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మామిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. పెన్షనర్ల పితామహుడు నకారా చిత్రపటానికి ఎంపీపీ పెన్షనర్లతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందిస్తానన్నారు. పెన్షనర్ల సంఘ సొంతభవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షనర్లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గరిసింగు దొరబాబు, పెన్షనర్ల సంఘ ప్రతినిధులు రమణమూర్తి, లెక్కల స్వామినాయుడు, పెన్షనర్లు పాల్గొన్నారు.

గోకవరం: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. పెన్షన్ పితామహుడు డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగులు బి.మంగరాజు, గండి రామకృష్ణ, రామారావు, సిద్దుల తాసు, వై.మాధవరావు, చింతల శివ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలోని తలుపులమ్మతల్లి లోవ దేవస్థానాన్ని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్రపు స్నానాలు చేశారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా తీరంలో వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు నీరు అందుబాటులో లేక పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.